క్లుప్తంగా

నేటి నుంచి మద్యం షాపులు బంద్

హయత్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం సాయంత్రం 4గంటల వరకు వైన్సులు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణ్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘించి మద్యం షాపులు తెరిచినా, దొంగ చాటుగా మద్యం అమ్మినా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లుగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా రమేష్

తలకొండపల్లి: ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా బానావత్ రమేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దోమరు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భగ్వాన్‌రెడ్డి తలకొండపల్లిలో శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. మండల పరిధిలోని ఆర్లకుంటతండాకు చెందిన రమేష్‌నాయక్ గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఆయన సేవలను గుర్తించి ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజీం, సేవాదళ్ అధ్యక్షుడు దశరథం, యువజన అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చెన్నకేశవులు, వెంకట్, గౌస్, చెన్నకేశవులు, ఆరీఫ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పరీక్షలకు నెలరోజుల సమయం మాత్రమే ఉందని ప్రణాళిక ప్రకారం చదువుతూ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని కోరారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పవన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో హత్యకు గురైన గిరిజన యువకుడు పవన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పవన్ కుటుంబ సభ్యులను వెల్దండ మండలం కేస్లీ తండాలో ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పవన్ హత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని, గిరిజన యువకుడు మరో మతం యువతిని ప్రేమించిన కారణంగానే యువతి కుటుంబ సభ్యులు దారుణంగా హతమార్చారని ఆరోపించారు. హత్యకు గురైన పవన్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు వినోద్, పవన్, మల్లేశ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

డీసీపీ సాయిశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డు సదాశివ ఎన్‌క్లేవ్‌లో నేను సైతం కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులు ఏర్పాటు చేసిన 56 సీసీ కెమెరాలను శుక్రవారం వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రతి ఇంటికి, విద్య, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణరెడ్డి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి బాలుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ శ్రీసాయినగర్‌కు చెందిన ఎల్లార రేవంత్ (19) గురువారం రాత్రి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు గుండా ప్రయాణిస్తుండగా కోహెడా కూడలి వద్దకు రాగానే కారు అదుపు తప్పి పల్టీలు పడుతూ పక్కనే ఉన్న గోడను ఢీకొట్టి బోల్తాపడింది. ఈఘటనలో రేవంత్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు


శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

కల్యాణం.. కమనీయం

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో ఉదయం 11గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని మంగళ తోరణాలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర సమేత ఉత్సవ విగ్రహాలకు ఆలయ నిర్వాహకులు పట్టు పీతాంబర వస్త్రాలను ధరింపజేసి కల్యాణమహోత్సవాలకు ముస్తాబు చేశారు. మంగళవాద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణంను నిర్వహించారు.

ప్రత్యేక పూజలు..

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి వేడుకల్లో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో కూర్చుండబెట్టి ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ రాజకుమార్‌రెడ్డి, ఈఓ మోహన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నిర్మల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా, సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, వేద పండితులు గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి ఊరేగింపులో నేతలు, భక్తులు


వేడుకలకు హాజరైన భక్తజనం

ఉపాధి పనుల్లో వేగం పెంచండి

ఎంపీడీఓ విజయలక్ష్మి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: గ్రామాల్లో జాబ్ కార్డులున్న ప్రతి కూలీ ఉపాధి పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. గ్రామంలో ఉన్న నర్సరీని, డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లోని నర్సరీల్లో ఉన్న మొక్కల సంరక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. నర్సరీల్లో ఒక్క మొక్క ఎండిపోయినా సిబ్బందిపైనే చర్యలు ఉంటాయని అన్నారు. ఉపాధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధి కూలీలకు వారంవారం వేతనాలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు. అనంతరం గడ్డమల్లయ్యగూడ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. మూడేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరవుతున్న నిధుల ద్వారా ఏ అభివృద్ధి పనులు చేపట్టారు, ఖర్చు చేసిన నిధుల రికార్డులను పరిశీలించారు. రికార్డుల నమోదులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్జున్ జంగయ్య, ఈజీఎస్ ఈసీ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.


జలాన్‌ఖాన్ చెరువును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఎఫ్‌టీఎల్ హద్దురాళ్ల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం రూరల్: 'కబ్జా కోరల్లో జలాన్‌ఖాన్ చెరువు' అనే శీర్షికతో శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్‌లో గల జలాన్‌ఖాన్ చెరువును ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి, రెవెన్యూ అధికారి కృష్ణ సందర్శించారు. చెరువులో మట్టిపోసి పూడ్చిన వ్యవహారమేనని తేల్చారు. అర ఎకరం మేర కబ్జాకు గురైనట్లు అధికారులు తేల్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ధి కోసం చెరువును చెరబట్టినట్లు తెలిపారు. ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. అయితే కబ్జాదారులపై కేసులు పెట్టకుండా, రియల్టర్లపై చర్యలు తీసుకోకుండా వెనుదిరగడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రజా సమస్యలపై పోరాడండి

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల


షర్మిల సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిన నేతలు

కడ్తాల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు చేయాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ యువజన సంఘాల నాయకులు నరేశ్‌గౌడ్, సాయి, రవికుమార్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమించాలని, ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలని షర్మిల సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొత్తకుంటతండా నుంచి..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కొత్తకుంటతండాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో కల్వకుర్తి ఇన్‌చార్జి బీమర్థ అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తకుంటతండాకు చెందిన సర్దార్‌నాయక్, హరినాయక్, గోపినాయక్, పవన్‌నాయక్, కుమార్, తులసీరామ్‌లు వైఎస్సార్‌టీపీలో చేరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


కడ్తాల్: బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


ఆమనగల్లు: ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో..

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. డీటీ డీఈఓగా రష్మిత, ఏటీడీఓగా ప్రీతి, ప్రధానోపాధ్యాయురాలుగా ఇందు వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో..

కడ్తాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా పవన్, డీఈఓగా సాయికిషోర్, ఎంఈఓగా శ్రీకాంత్, కలెక్టర్‌గా రాకేశ్, నోడల్ ఆఫీసర్‌గా లోకేశ్ వ్యవహరించగా మరో 90 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఉత్తమంగా బోధించిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల సమస్య పరిష్కరిస్తాం

బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి


హోటల్ నిర్వాహకుడితో మాట్లాడుతున్న ప్రశాంత్ కుమార్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మజీద్‌పూర్ గ్రామంలో దాదాపు ఆరు దశాబ్దాలుగా రైతులకు ఇబ్బందికరంగా మారిన సీలింగ్ భూముల సమస్యను ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి సహకారంతో పరిష్కరించే దిశగా కృషి చేస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రగతి నివేదన యాత్రలో భాగంగా శుక్రవారం 48వ రోజు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి చేరుకున్న మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి గ్రామంలో గడపగడపకు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామస్తులకు ఇంకా ఎలాంటి అభివృద్ధి కావాలనే అంశాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంతపల్లి-మజీద్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. గంగమ్మపెద్దమ్మ దేవాలయాలకు వెళ్లేందుకు నిర్మించే రోడ్డు కోసం రూ.5లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.2లక్షలు ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామశాఖ అధ్యక్షుడు ఎద్దు మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ గౌడ్, నాయకులు ఆశోక్ గౌడ్, జంగయ్యగౌడ్, శ్రీశైలంగౌడ్, మండల ఉపాధ్యక్షుడు రాజారామ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉప్పరాశికుంట సర్వే చేపట్టండి

కడ్తాల్: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 65లో గల ఉప్పరాశికుంటకు గ్రామ ప్రజల సమక్షంలో సర్వే చేపట్టి హద్దురాళ్లని పాతాలని ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మండల కేంద్రంలోని తహసీల్దార్ మునీరుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, అంబేడ్కర్ యువజన సంఘాల మండల అధ్యక్షుడు సిద్దిగారి దాస్, ఉప సర్పంచ్ రామక్రిష్ణ, నాయకులు ఉన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం: జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్‌ను 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నూనె వెంకటేశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినోబానగర్‌లోని సాధన కుటీర్‌లో రెండు బ్యాచ్‌లుగా ఈ శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి ఐదున్నర గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు ఈనెల 16లోపు పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఆకుతోటపల్లిలో కంటివెలుగు శిబిరం

ఆమనగల్లు: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆకుతోటపల్లి సర్పంచ్ శ్రీపాతి రజిత కోరారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో శుక్రవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పరీక్షిత్ నరేందర్, మంజులాదేవిల ఆధ్వర్యంలో 157 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్ట నారాయణ, స్థానికులు గోవిందయ్య, బాలు, తిరుపతయ్యగౌడ్, ఆస్పత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకి నివాళి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, సభ్యులు సురేశ్‌రెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థులు వాణిశ్రీ, శ్రీలత, లక్ష్మీదేవి, శ్రీజ, సవిత, ఉమని తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి మండల కేంద్రంలో..

తలకొండపల్లి: ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఎంపీపీ నిర్మల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడారు.ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, సూపరింటెండెంట్ శ్యాంసుందర్, కార్యదర్శి రాఘవేందర్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

సావిత్రీ బాయి ఆశయ సాధనకు కృషి

కడ్తాల్: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, సర్పంచ్ రాములు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు నర్సింహ, బీక్యానాయక్, రవికుమార్, తిరుమలేశ్ ఉన్నారు.


ఆమనగల్లు: సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


సన్మానించిన ఉపాధ్యాయులతో పంచాయతీరాజ్ ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి

పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఓపిక, సహనానికి మారుపేరు మహిళలని పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం ఇంద్రసేనారెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25 మంది టీచర్లను సత్కరించారు. హెచ్‌ఎం జాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సన్మానం..

ఆమనగల్లు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమనగల్లు తహసీల్దార్ జ్యోతి కోరారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను, సూపర్‌వైజర్లను తహసీల్దార్ జ్యోతి, ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి ఘనంగా సత్కరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలోమహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్, డా.జయశ్రీ, డా.అర్చనారెడ్డి, డా.మంజులాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలి..

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళా సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని ఎల్మినేడు సర్పంచ్ ఎద్దు ఆశోకవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఎల్మినేడు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశ వర్కర్లను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పీహెచ్‌సీ వైద్యులు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన ఆయిల్ అనంతరాములుగౌడ్ (54) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. బీజేపీ మండల అధ్యక్షుడు రఘుగౌడ్, సర్పంచ్ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస యాదవ్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 9,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు హేమరాజు, అంబాజీ, ఉప సర్పంచ్ ఆజీజ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీనివాస రెడ్డి, శేఖర్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, రవి, పెంటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

టీఎస్‌యూటీఎఫ్

కడ్తాల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్.దుర్గాభవాని పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సంఘం నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, జిల్లా కార్యదర్శి భవనేశ్వరి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రామయ్య, హెచ్‌ఎం జంగయ్య, మండల కార్యదర్శి మల్లయ్యగౌడ్, నాయకులు రాజేశ్, జంగయ్య, కౌసల్య, సునీత, జంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సేవ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.